క్లుప్తంగా

దత్తాశ్రమంలో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని గణపతి సచ్చిదానంద స్వామిజీ దత్తాశ్రమంలో గురువారం చండీహోమం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ అనఘాష్టమి పురస్కరించుకుని ఆశ్రమంలో వేదపండితులు, అర్చకులు ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించినట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు.

రాజమండ్రికి తరలిన శ్రీవారి ధర్మప్రచార రథం



లక్ష్మీపురం ఆలయం నుంచి బయల్దేరి వెళుతున్న శ్రీవారి ధర్మప్రచార రథం

ద్వారకాతిరుమల: తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి గైట్ కళాశాలలో జరిగే తెలుగు మహాసభలకు శ్రీవారి ధర్మప్రచార రథం గురువారం తరలివెళ్లింది. ముందుగా రథం లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి చేరుకుంది. అక్కడ అర్చకులు కొబ్బరికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. అనంతరం రథం రాజమండ్రికి పయనమైంది.

30 మంది వికలాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



దివ్యాంగుడికి వీల్‌చైర్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: దివ్యాంగులకు ఇండియా క్రిస్టియన్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో ఉచిత వీల్ చైర్ల పంపిణీ గురువారం కుక్కునూరులో నిర్వహించారు. మినిస్ట్రీస్ ప్రతినిధులు రమేష్, శ్రీపాల్ ఆధ్వర్యంలో 30 మంది వికలాంగులకు వీల్‌చైర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.నాగేశ్వరరావు, తహసీల్దార్ ప్రమద్వర, కుక్కునూరు సీఐ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా పేదలను, దివ్యాంగులను ఆదుకోవడం గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ సభ్యులను అభినందించారు. ఎస్సై రామకృష్ణ, స్థానిక సర్పంచ్ మీనా, డానియల్, వైఎస్సార్ సీపీ నాయకులు వినోద్ వసంత్ పాల్గొన్నారు.

కళాశాలల్లో మాక్ పోలింగ్



జంగారెడ్డిగూడెం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని కళాశాలల్లో మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల శ్రీరామ చంద్ర డిగ్రీకళాశాల, శంకరి డిగ్రీ కళాశాల, సూర్య డిగ్రీ కళాశాలల్లో గురువారం ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేలా మాక్ పోలింగ్ నిర్వహించారు. బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు, ఎన్నికల గుర్తులు, ఓటింగ్ ప్రక్రియ తదితర అంశాలను తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ వివరించారు. అదేవిధంగా మాక్ పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే ఓటర్లందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. మాక్ పోలింగ్ ట్రైనింగ్ అధికారి శశి కుమార్, వివిధ కళాశాలల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కుంతీదేవి ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న సినీ డైరెక్టర్ వీవీ వినాయక్

పోలవరం రూరల్: మహాలక్ష్మీదేవిపేటలో కుంతీదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కళాకారులు వివిధ దేవతామూర్తులు, విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కుంతీదేవిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలకు సినీ డైరెక్టర్ వీవీ వినాయక్ విచ్చేసి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఈస్టయడవల్లి సర్పంచ్ పొన్నాల అనిత, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా జాయింట్ సెక్రటరీ ఘంటా శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- టి.నరసాపురంలో పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు, అభివాదం చేస్తున్న పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజ్యలక్ష్మి

టి.నరసాపురం: నవరత్న పథకాల ద్వారా గత నాలుగున్నరేళ్లలో రూ.3 లక్షల కోట్లు పేదల ఖాతాల్లో నేరుగా జమ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితురాలైన తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ఆయన గురువారం టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలో కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాలరాజు మాట్లాడుతూ దేశంలోనే వినూత్నమైన పరిపాలన జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.3 వేల పింఛన్‌ను అందిస్తున్నారన్నారు. నవరత్న పథకాల ద్వారా ఒకొక్క కుటుంబానికి రూ.1 లక్ష నుంచి రూ. 6 లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించారన్నారు. పింఛన్ల కోసం ఏడాదికి రూ.23 వేల కోట్లు ఈ ప్రభుత్వం ఖర్చుచేస్తుందని వివరించారు. చంద్రబాబు నెలకు రూ.400 కోట్లు ఖర్చు చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. అక్కచెల్లెమ్మల రుణాలు రూ.25 వేల కోట్లను 3 విడతల్లో జమ చేసి 4వ విడత జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆరోగ్యశ్రీలో అనుమతిస్తున్న వెయ్యి రకాల వ్యాధుల నుంచి 3 వేలకు పైగా వ్యాధులకు పెంచారన్నారు. చంద్రబాబు చేసిన అప్పు మొత్తం చంద్రబాబు, ఆయన అనుచరుల జేబుల్లోకి వెళ్లాయని విమర్శించారు. జన్మభూమి కిరికిరి కమిటీల వద్ద టీడీపీ హయాంలో చేయిచాచాల్సి వచ్చేదని, పింఛన్‌దారుడు చనిపోతేనే కొత్త పింఛన్ ఇచ్చే వారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను నేరుగా అవినీతి రహితంగా రాజకీయాలకు అతీతంగా అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎటువంటి పోరాటాలు లేకుండానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారని, మహిళల పక్షపాతి జగన్ అని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి అంటేనే జగన్ అని వివరించారు. దుష్ట శక్తులు మాయాజాలంతో భ్రమింపచేయడానికి వస్తున్నాయని, తస్మాత్ జాగ్రత్త అంటూ సున్నితంగా హెచ్చరించారు. జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఎన్నికల్లో గెలిపించాలని ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సామంతపూడి సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, యర్రా గంగాధరరావు, దాసిరి రాంబాబు, బొంతు అంజిబాబు, బండిసుబ్బారావు, బోళ్ల రంగారావు, ఆచంట నాగమణి, సర్పంచ్ సునంద, ఎంపీటీసీలు నార్లపాటి వెంకట్రావు, రాంబాబు, గాది రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే..



జంగారెడ్డిగూడెం: సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



చింతలపూడి: ప్రగడవరం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో షటిల్ పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులు

చింతలపూడి: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు మండలంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం ప్రగడవరం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో షటిల్ పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పోటీలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఆటల పోటీల వల్ల గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా గురువారం క్రికెట్ పోటీలు మూడో రోజు నిర్వహించారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో పురుషుల విభాగంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు 3 సచివాలయాల పరిధిలో 14 జట్లు పాల్గొన్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. మొత్తం 7 మ్యాచ్‌లు నిర్వహించగా, మూడు టీమ్‌లు విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. పీడీ జయరాజు, ఆయా శాఖల, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం



బాలోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

జంగారెడ్డిగూడెం: స్థానిక విద్యావికాస్ విద్యా సంస్థల్లో గురువారం జంగారెడ్డిగూడెం బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పట్టణ, మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, లయన్స్ క్లబ్, బోడేపూడి సుందరయ్య స్మార్ట్ ట్రస్ట్, క్షత్రియ సేవా సమితి, వివిధ సేవా సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో అవసరం అని అన్నారు. ఈ సందర్భంగా కల్చరల్ అకడమిక్ విభాగాల్లో 32 అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు మానవత మూర్తి, అధ్యక్షుడు కె.వజ్రకిరణ్, కార్యదర్శి వెంకన్నబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.హనుమంతరావు, కార్యదర్శి కొండపల్లి పండు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, లయన్స్ క్లబ్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, కాకరాల వేణుబాబు, ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పి.రంగరాజు, జి.వి జయరామరాజు, నంబూరి రామచంద్రరాజు, ఎండీ ఉమర్‌ఆలీ, ఎల్ఆర్ కృష్ణబాబు, మానవత కన్వీనర్ త్రిపుర, విద్యావికాస్ అధినేతలు పి.సతీష్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



కుక్కునూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో గురువారం సర్పంచ్ టి భూపతి అధ్యక్షతన గ్రామ పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎంపీడీఓ మురళీకృష్ణ ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల స్టాల్స్‌ను సందర్శించారు. ఉప సర్పంచ్ ఎస్.రమేష్‌రెడ్డి, మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కుక్కునూరు: మండలంలోని మారేడుబాకా, కివ్వాక పంచాయతీలో ఎంపీడీవో ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు వంకా కాంచనమాల, జిల్లా కార్యదర్శి రాచమడుగు వరలక్ష్మి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తించాలి



పరింపూడిలో విద్యార్థుల మానవహారం

కొయ్యలగూడెం: ఓటు హక్కు కలిగి ఉన్న పౌరులందరూ ఎన్నికలలో తమ ఓటు వినియోగించుకోవడం నైతిక ధర్మం అని తహసీల్దార్ పాశం నాగమణి పేర్కొన్నారు. పరింపూడి బాలిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు నమోదు విధానలను, ఓటు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులచే మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ జే సురేష్‌బాబు, ఆర్ఐ మణిదివ్య, విద్యా, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

జంగారెడ్డిగూడెం రూరల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని సర్పంచ్ గెల్లా వెంకటరమణ అన్నారు. లక్కవరంలో ఓటు నమోదు కార్యక్రమంపై ర్యాలీ, ఈవీఎంల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, సొసైటీ చైర్మన్ బడి దుర్గారావు, పార్టీ నాయకులు చిల్ల దుర్గారెడ్డి, దల్లి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీరామ పూజిత అక్షింతల శోభాయాత్ర



అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు: అయోధ్య శ్రీరాముడిని పూజించిన అక్షింతల వితరణ కార్యక్రమాన్ని గురువారం కుక్కునూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి అక్షింతల కలశాలను తలపై పెట్టుకుని మహిళా భక్తులు కుక్కునూరు ప్రధాన సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యుడు బొల్లు ప్రసాద్, స్థానిక సర్పంచ్ రావు మీనా, రావు వినోద్, రావు సత్యనారాయణ, పసుమర్తి కిషోర్, పాదం రాము, మన్యం సత్యనారాయణ, చక్రధర్‌రావు, మన్యం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి ఫూలేను ఆదర్శంగా తీసుకోవాలి



బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫూలే జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మహిళల విద్య అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన సావిత్రిబాయి ఫూలేను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి ఫూలే జయంతి వారోత్సవాలను బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి వెలగల దుర్గారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, వైస్ ఎంపీపీ వనజ లక్ష్మి మాట్లాడుతూ సావిత్రిబాయి ఆశించిన విధంగా నేటి విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని కోరారు. కోట్ల ఆస్తి ఉన్న వారి కంటే ఉన్నత చదువులు ఉన్న వాడే గొప్పవాడని తెలిపారు. అనంతరం కాలేజీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి స్కూలు డైరెక్టర్ ఎంఎస్ రావు రూ.2 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందించారు. అనంతరం ఎంఎస్ రావును సావిత్రిబాయి ఫూలే పురస్కారంతో సన్మానించారు. కార్యక్రమంలో జె.శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు తాడిగడప ఆంజనేయరాజు, బీసీ చైతన్య సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ గోపాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ



రేచర్ల గ్రామంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ శివరామకృష్ణ

చింతలపూడి: మండలంలో పింఛన్ల పంపిణీ పండగ వాతావరణంలో జరుగుతుంది. గురువారం రేచర్ల గ్రామంలో సర్పంచ్ కె.శివరామకృష్ణ వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. చింతపల్లి గ్రామంలో సర్పంచ్ తాంత్ర రామకృష్ణారావు వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. పాత చింతలపూడిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ కాంతారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం ఇమ్మానియేలు పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కొత్త ఏడాదిలో ఈ నెల నుంచి పింఛన్ రూ.3 వేలకు పెంచడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం ఆలపాటి గంగాభవానీ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా చేతుల మీదుగా రూ: 3 వేల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి పింఛన్ లబ్ధిదారులు, అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

కొయ్యలగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరై లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్ అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలరాజుతోపాటు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి ప్రత్యేక అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు.

సొసైటీ వద్ద డిపాజిట్‌దారుల ఆందోళన



టి.నరసాపురం సొసైటీ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న డిపాజిట్‌దారులు

టి.నరసాపురం: సొమ్ము చెల్లించడం లేదంటూ డిపాజిట్‌దారులు టి.నరసాపురం సహకార సంఘం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. సిబ్బందిని కార్యాలయంలోకి వెళ్లనీయకుండా గేట్లు మూసి వేసి అడ్డుకున్నారు. పెట్రోల్ బంక్‌లో అమ్మకాలు జరగకుండా అడ్డుకన్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లోనూ డిపాజిట్ సొమ్ములు చెల్లించడం లేదని, కనీసం ఖాతాల్లో ఉన్న నిల్వ సొమ్మును కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. పోలీసులు, అధికారులు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పడంతో తాత్కాలికంగా ఆందోళనను విరమించారు. ఎస్‌కే ఇసావలి, చిట్టిబొమ్మ శ్రీను, కన్నం శ్రీను, పేరం రాంబాబు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాల పరిశీలన



రాజవరంలో అన్నపు ట్యాంకు ప్రాంతాన్ని పరిశీలించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు కావడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం, టి. నర్సాపురం మండలాల్లో అధికార యంత్రాంగం పర్యటించింది. కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం ప్రాంతాలు, ఆయా గ్రామాల్లో ఉన్న చెరువుల ప్రాంతాల్లో మైన్స్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీంగా ఏర్పడి పరిశీలించారు. మైన్స్ ఏడీ రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ దేవ ప్రకాష్, ఇరిగేషన్ జంగారెడ్డిగూడెం ఏఈ భాస్కరరావు పర్యటించారు. కాకినాడకు చెందిన త్రినాథ్ అనే వ్యక్తి అక్రమ మట్టి తవ్వకాలపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ పర్యటన చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ల్యాప్‌టాప్‌ల అప్పగింత

పోలవరం రూరల్: ప్రయాణంలో పోగొట్టుకున్న ల్యాప్‌ట్యాప్‌లను తిరిగి ఆ వ్యక్తి కుటుంబానికి పోలీసులు అప్పగించారు. వివరాల ప్రకారం పోలవరం మండలం కన్నాపురం అడ్డ రోడ్డు వద్ద బస్ షెల్టర్‌లో ఓ వ్యక్తి హైదరాబాద్ బస్సు ఎక్కుతూ రెండు ల్యాప్‌ట్యాప్‌లు ఉన్న బ్యాగ్‌ను వదిలి వెళ్లిపోయాడు. తరువాత దీనిపై ఆ వ్యక్తి తండ్రి వి.సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆ ప్రాంతంలో విచారణ జరుపగా ఒక ఆటో డ్రైవర్ వద్ద ఆ బ్యాగ్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ల్యాప్‌టాప్‌లు ఉన్న బ్యాగ్‌ను ఆ వ్యక్తి తండ్రి సత్యనారాయణకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

నాణ్యమైన పొగాకును పండించాలి

కొయ్యలగూడెం: పండుగుల్ల పొగాకును ఇకపై వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలోనే అమ్ముకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని వర్జీనియా పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ఎం.ఆదిశేషయ్య తెలిపారు. గురువారం కొయ్యలగూడెం వర్జీనియా వేలం కేంద్రం సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో యర్రంపేట, ధర్మారావుపేట గ్రామాల్లో రైతు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన పొగాకును పండించాలని ఆదిశేషయ్య రైతులకు సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. ఐటీసీ కంపెనీ మార్కెటింగ్ మేనేజర్ కొట్రేశి, పీఎస్ఎస్ లీఫ్ మేనేజర్ రఘు రాంప్రసాద్, వేలం నిర్వహణ అధికారి ఎం.గ్రేస్ మార్గరెట్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

పోలవరం రూరల్: అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. పోలవరం మండలం పట్టిసం గ్రామంలో టి.కోటయ్య అనే వ్యక్తి అక్రమంగా 15 బీరు సీసాలు కలిగి ఉన్నాడన్న సమాచారం మేరకు దాడి చేసి, అతడిని అరెస్ట్ చేసి, బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. 33/11కేవీ రాఘవాపురంలో బే ఎక్స్‌టెన్షన్ పనులు, 33కేవీ లింగపాలెం ఫీడర్, చింతలపూడి పట్టణం నాగిరెడ్డిగూడెం ఫీడర్ లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాస్‌పోర్ట్ పోయినది
దేవనేని నరేంద్రకుమార్ S/o వెంకట సుబ్బారావు H.No.1-139-1 రాఘవాపురం గ్రామం చింతలపూడి (మం), ఏలూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్. నా పాస్‌పోర్ట్ నెం.B1623476 మా ఇంటి నుండి చింతలపూడి జిరాక్స్ తీయుటకు వెళ్ళుచుండగా పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.
రాఘవాపురం, ది.03.01.2023.
దేవనేని నరేంద్రకుమార్
సెల్: 94917 22166





సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com